సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



జెట్టీపై జాప్యం ఎందుకో?

తీరప్రాంతం చింతపల్లిలో మంజూరైన జెట్టీ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చింతపల్లికి రూ.23 కోట్లతో జెట్టీ మంజూరు చేశారు. - 8లో



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జ్యోత్స్న - 8లో

రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు గాజులరేగ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పతివాడ జ్యోత్స్న ఎంపికైంది.



క్రీడా సముదాయానికి పదెకరాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో క్రీడా సముదాయం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. - 8లో

న్యూస్‌రీల్

అరకు ఎంపీకి సముచిత స్థానం

- రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కమిటీలో సభ్యురాలిగా నియామకం
- పార్లమెంట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు



ఎంపీ గుమ్మా తనూజారాణి

సాక్షి, పాడేరు: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక కమిటీలో సముచిత స్థానం కల్పించింది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ కమిటీ సభ్యురాలిగా ఆమెను నియమిస్తూ పార్లమెంట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆమె కేంద్ర ప్రభుత్వం పరిధిలోని హౌసింగ్, జాతీయ ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ సభ్యురాలిగా పని చేస్తున్నారు. అదనంగా రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యురాలిగా నియమించడంపై పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

సీతంపేటలో పీజీఆర్ఎస్ రేపు

సీతంపేట/పార్వతీపురం: సీతంపేట ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించుకోవచ్చన్నారు. జిల్లా అధికారులంతా హాజరు కావాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన డీఈఓ



డీఈఓ తిరుపతిరావును అభినందిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: పార్వతీపురం డీఈఓగా ఎస్.తిరుపతిరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు విజయనగరం డైట్ సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు డీఈఓగా విధులు నిర్వహించిన జి.పగడాలమ్మ విజయనగరం డైట్ ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తిరుపతిరావు తెలిపారు. ఆయనను డీఈఓ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

29న ధ్రువపత్రాల పరిశీలన

సీతంపేట: భామిని, మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పీజీటీ, ఫిజిక్స్, గణితం, కెమిస్ట్రీ ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29న ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని ఈఎంఆర్ఎస్‌లో ఉదయం 10 గంటలకు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు.

కేజీబీవీ నియామకాల్లో అక్రమాలు!

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ప్రచార సభల్లో ఆయా పార్టీల నేతలు ఊదరగొట్టారు. ఇందులో భాగంగానే కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను కాంట్రాక్ట్ పద్ధతిలో చేపట్టారు. కొద్ది రోజుల కిందట దరఖాస్తులను ఆహ్వానించారు. దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేశారు. తీరా చూస్తే ఇప్పటికే కేజీబీవీల్లో పని చేసి ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇచ్చిన సర్వీసు పాయింట్లు.. మెరిట్ జాబితాకు వచ్చేసరికి మాయమయ్యాయి. దీంతో ఒక్కసారిగా అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. దరఖాస్తులతో పాటు సర్వీసు సర్టిఫికెట్లు జత చేస్తే జాబితాలో ఆ పాయింట్లు మిస్ చేయడమేంటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ఒక ఫార్సుగా కూటమి ప్రజాప్రతినిధులు మార్చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దరఖాస్తుల పరిశీలన కార్యక్రమానికి హాజరైన అభ్యర్థులు(ఫైల్)

- కాంట్రాక్ట్ సిబ్బంది నియామకాల్లో సర్వీస్ పాయింట్లు మాయం
- మెరిట్ జాబితాలో జత చేయని వైనం
- దరఖాస్తుదారుల్లో ఆందోళన
- అంతా డీఈఓ కార్యాలయ ఉద్యోగి కనుసన్నల్లోనే..

పార్వతీపురం టౌన్: కేజీబీవీల్లో కాంట్రాక్ట్ సిబ్బంది నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. మెరిట్ జాబితా విడుదల సమయంలో తమ సర్వీస్ పాయింట్లను ఆ జాబితాలో పొందుపరచకపోవడంపై దరఖాస్తుదారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 900 బోధన, బోధనేతర సిబ్బంది సంబంధిత పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమానికి సైతం ముందు రోజే అభ్యర్థులకు సమాచారం తెలియజేయడంతో 1200 మంది పరిశీలన చేయించుకోవాల్సి ఉండగా కేవలం 900 మంది వరకే పరిశీలనకు హాజరు కాగలిగారు. ఈ పరిశీలన తీవ్ర అసౌకర్యాల నడుమ జరిగింది. ధ్రువపత్రాల పరిశీలన తరువాత వెబ్‌సైట్‌లో అభ్యంతరాల సేకరణ కార్యక్రమం చేపడతామని అధికారులు తెలిపారు. అభ్యంతరాలు తెలిపేందుకు రెండు రోజులు మాత్రమే సమయం ఇచ్చారు. అభ్యంతరాలు తెలిపేందుకు వెబ్‌సైట్‌లో రాత్రి 9 గంటలకు పెట్టడం మాట తప్పి ఒక రోజే అభ్యంతరాలు తెలియజేసేందుకు సమయం ఇవ్వడంతో మొత్తం ప్రక్రియపైనే దరఖాస్తుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు తప్పనిసరి

గతంలో కేజీబీవీలో పారదర్శకంగా కాంట్రాక్టర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఉంటేనే పరిగణనలోకి తీసుకున్నారని అభ్యర్థుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ మేరకు ప్రజాప్రతినిధులు సూచించిన అభ్యర్థులకు అనుకూలంగా ఉండేందుకు సర్వీసు పాయింట్లను మాయం చేశారని సమాచారం. ఇప్పటికే ఈ నియామకాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు రూ.లక్షల్లో జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి.

అంతా ఆ ఉద్యోగి చేతుల్లోనే...

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి నియామకాల విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నాడని వినికిడి. నియామకాల విషయంలో అంతా తానై వ్యవహరిస్తున్నట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తుదారుల నుంచి భారీ మొత్తం నగదు వసూలు చేసి ప్రజాప్రతినిధులకు అందజేస్తున్నాడన్న సమాచారం. ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు వసూలు చేస్తున్నట్టు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం రాజకీయ ఒత్తిళ్లతోనే నియామక ప్రక్రియ జరుగుతోందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నా సర్వీసు పాయింట్లు జత చేయలేదు..

నేను 2013 సంవత్సరం నుంచి కేజీబీవీలో పని చేస్తున్నాను. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమంలో నాకు 10 సర్వీసు పాయింట్లు యాడ్ చేశారు. సర్వీసు సర్టిఫికెట్ సైతం జమ చేశాను. మెరిట్ లిస్టులో నా సర్వీసు పాయింట్ల 0గా చూపించారు. నాకు తెలిసి కేవలం రాజకీయ ఒత్తిళ్లతోనే ఇలా చేశారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారు. రాజకీయ నేతల అండదండలు ఉంటేనే న్యాయం జరిగేలా ఉంది. ఇదేక్కడి న్యాయం.

– **అల్లు శ్రీదేవి**, దరఖాస్తుదారు, మక్కువ మండలం

ఇది సరైన విధానం కాదు

అర్హులకు న్యాయం జరగడం లేదు. నేను 2021 – 24 మధ్యలో కేజీబీవీల్లో విధులు నిర్వహించాను. ఐదేళ్ల విధులు నిర్వహించినా నాకు కేవలం 0 సర్వీసు పాయింట్లు మాత్రమే చూపిస్తున్నారు. నేను విధులు నిర్వహించిన మిగిలిన సంవత్సరాలు ఏమయ్యాయి. కేవలం ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే ఉద్యోగాలు ఇస్తే ఈ నోటిఫికేషన్ ప్రకియ దేనికి. అభ్యర్థులను మోసం చేసే విధంగా ఈ ప్రక్రియ ఉంది. ఇది సరికాదు.

– **ఎస్.స్నేహలత**, గెస్ట్ సీఆర్‌టీ, ఫిజిక్స్, వీరఘట్టం

గిరిజన ప్రాంతాల్లో వైద్యుల సేవలు తప్పనిసరి

- కొరత ఉన్నచోట సర్దుబాటు చేయండి
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మరుగుదొడ్ల నిర్మాణం
- రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాక్షి, పార్వతీపురం మన్యం : గిరిజన ప్రాంతాల్లోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికీ తప్పనిసరిగా వైద్యులు ఉండాలని.. లేనిలోట సర్దుబాటు చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులతో పాటు మందులు కూడా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆమె వివిధ శాఖల పురోగతిపై శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి కోసం ఎస్‌సీఎం ఇంజక్షన్ అందుబాటులో ఉంచుకోవాలని, వాటికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాలూరులో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి ఇటీవలే ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసిందని, మిగిలిన పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేస్తామన్నారు. కురుపాంలోని ఆస్పత్రికి రూ.40 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని, సంక్రాంతి నాటికి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 129 పాఠశాలలు మూతపడ్డాయని, వాటిపై సమగ్ర సర్వే చేసి అవసరమైన వాటిని ప్రారంభించాలని ఆదేశించారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలోని పాఠశాలలను తెరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. వసతిగృహ విద్యార్థులకు కాస్మోటిక్స్ సామగ్రిని జీసీసీ ద్వారా నేరుగా అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి పది మంది విద్యార్థులకూ ఒక మరుగుదొడ్డి ఉండాలని స్పష్టం చేశారు. టాయిలెట్లు లేని పాఠశాలలను గుర్తించి నిర్మించాలని సూచించారు.

తొలిదశలో 549 గ్రామాలకు రహదారి సౌకర్యం

జిల్లాలో 2,748 గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని మంత్రి చెప్పారు. తొలి దశలో 549 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని.. దశల వారీగా మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. కుంకీ ఏనుగులతో గ్రామాల్లోని ఏనుగుల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతి పంచాయతీలో బాల విహార్, యువ కేంద్రాలు చేపట్టాలని చెప్పారు. 469 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ సదుపాయం లేదని, అక్కడ నిర్మించడంతో పాటు, నీటి సదుపాయం కల్పించాలన్నారు. సొంత అంగన్‌వాడీ భవన నిర్మాణాల కోసం ఐదు సెంట్ల స్థలాన్ని వీఆర్‌ఓల ద్వారా సేకరించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. జిల్లా ప్రగతిని, చేపట్టబోయే కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వివరించారు. సమావేశంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

29న పాలకొండలో జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: పాలకొండలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుకొని 18 – 25 ఏళ్ల యువతి, యువకుల కోసం మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మినీ జాబ్ మేళాలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీ కోసం ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశానికి హాజరు కావాలని కోరారు. వివరాలకు 63012 75511 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఏనుగుల సంచారంపై తస్మాత్..

- జిల్లా అటవీ అధికారి ప్రసూన

పార్వతీపురం టౌన్: జిల్లాలో రెండు ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయని జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలం దిబ్బగుడివలస గ్రామ పరిధిలో ఏడు ఏనుగులతో కూడిన ఒక గుంపు, భామిని మండలం జామిగూడ గ్రామ సమీపంలో నాలుగు ఏనుగులతో కూడిన మరో గుంపు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఇచ్చిన సూచనలను కచ్చితంగా ప్రజలు పాటించాలని ఆమె అభ్యర్థించారు. అడవి ఏనుగులు రోజులో ఎక్కడైనా సంచరించే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో మంద ఉన్నప్పుడు గ్రామస్తులు, వ్యవసాయ పొలాలకు వెళ్లొద్దని సూచించారు. గ్రామ పెద్దలు, సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, పోలీసు శాఖ ఇతర శాఖలు గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో తమకు సహకరించాలని ఆమె కోరారు. అటవీ శాఖ పర్యవేక్షణను ఎవరైనా అడ్డుకున్నా.. ఏనుగుల దగ్గరికి వెళ్లేందుకు ప్రయత్నించినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. జంతువులను రాత్రింబవళ్లు ట్రాక్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు తమకు సహకరించకపోతే రక్షించడంలో విఫలమవుతామని పేర్కొన్నారు. ఏనుగులు ఈ ప్రాంతాలకు అలవాటు పడ్డాయని, ఐదారేళ్లుగా ఆయా ప్రాంతాల్లో ఉంటున్నాయని, ప్రజలు దీన్ని గుర్తించాలని కోరారు. ప్రజలను రక్షించడం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయడంలో రెవెన్యూ, పోలీసు శాఖల సహకారం అందించాలని కోరారు.

రూ.లక్ష కొట్టు.. బెల్టు పెట్టు..!

- గ్రామాల్లో మద్యం దుకాణాలు
- సిండికేట్ కనుసన్నల్లోనే వ్యవహారం
- అధికారికంగానే 'లైసెన్సులు'
- జనాభా ప్రాతిపదికన ధర నిర్ణయం



సాక్షి, పార్వతీపురం మన్యం: మద్యం విక్రయాలు ప్రైవేట్‌పరం కావడంతో మళ్లీ గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచేందుకు సన్నద్ధమవుతున్నారు. అధిక మొత్తంలో వెచ్చించి మద్యం దుకాణాలను దక్కించుకోవడంతో.. సిండికేట్ వ్యాపారులు అధికారికంగానే గ్రామాల్లో బెల్టు షాపులకు 'లైసెన్సులు' ఇచ్చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన ధర నిర్ణయించి, ఆ మేరకు చెల్లించిన వారికి బెల్టు షాపు పొందేందుకు అనుమతులు ఇస్తున్నారు. మొత్తం సరుకంతా లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నుంచే వెళ్తుంది. సిండికేట్‌గా మారి.. ఇప్పటికే పెద్ద ఎత్తున వైన్‌షాపులను దక్కించుకున్నది కూటమి నాయకులే..ఈ బెల్టు షాపులకూ సూత్రధారులు వారే.

మండలానికి కనీసం పది దుకాణాలు

జిల్లాలో 52 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటైన విషయం విదితమే. నాలుగు నియోజకవర్గాల పరిధిలో 15 మండలాలు.. 451 పంచాయతీలున్నాయి. 50 వేల జనాభా ప్రాతిపదికన దుకాణాలకు అనుమతులిచ్చారు. ఇప్పుడు బెల్టు షాపులను సైతం 2 వేల నుంచి 5 వేల జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు సిండికేట్ వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రానికి..పంచాయతీకి ఉన్న దూరాన్ని బట్టి..కనీసం ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా కనీసం మండలానికి 10 దుకాణాలైనా తెరిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం బెల్టు షాపుల నిర్వాహకుల వద్ద జనాభా, విక్రయాల స్థాయిని బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక కూటమి నాయకులే మొత్తం ప్రక్రియలో చక్రం తిప్పుతున్నారు. ఇందుకు కొంత కమిషన్‌ను వసూలు చేస్తున్నట్లు వినిపిస్తోంది. ఎక్సైజ్ అధికారులు అటువైపు చూడకుండా..దరిదాపుల్లో మరో బెల్టు షాపు ఏర్పడకుండా సిండికేట్ వ్యాపారులే అన్నీ చూసుకుంటారు. అంత మొత్తం ఇచ్చేందుకు బెల్టు షాపుల నిర్వాహకులు కూడా వెనుకాడడం లేదు. గతంలో అనధికారికంగా విక్రయాలు జరిపిన వారే..మళ్లీ ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

జనావాసాల మధ్యే దుకాణాలు

మరోవైపు జిల్లాలో ఇటీవల ఏర్పాటైన మద్యం దుకాణాలు అధిక శాతం జనావాసాల మధ్య..విద్యాలయాల ముందే ఉన్నాయంటూ స్థానికుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. పాచిపెంట మండల కేంద్రంలో బస్టాండ్ సమీపాన ఉన్న గ్రంథాలయం ముందే రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. నిత్యం విద్యార్థులు, వృద్ధులు ఎక్కువగా ఈ గ్రంథాలయానికి వస్తుంటారు. ఇటువంటి చోట దుకాణం తెరవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాలూరులోనూ సంతోషిమాత ఆలయం సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. బలిజిపేట మండల కేంద్రంలోనూ గుడి, బడి సమీపంలో దుకాణాలు తెరవడంపై మహిళలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో దుకాణాలను తొలగించాలని ఇటీవల తహసీల్దారు కార్యాలయంతో పాటు, పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఇప్పుడు బెల్టుషాపులు పెరిగితే పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారవుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో ఆర్ట్ గ్యాలరీ

● ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



ఆర్ట్ గ్యాలరీని పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జిల్లా కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేయడంతోపాటు సుందరమైన ప్రకృతి సోయగాల పరిసరాలను రూపకల్పన చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జ్యోత్స్న



స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించిన జ్యోత్స్న

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పతివాడ జ్యోత్స్న ఎంపికైంది. ఇటీవల జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో 600 మీటర్ల పరుగుపోటీతో పాటు 400 మీటర్ల పరుగు పోటీలో ప్రథమస్థానం సాధించిన జ్యోత్స్న త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్‌జిల్లాల స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీబీ చారి తెలిపారు. జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్న విద్యార్థినితో పటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు రవి, ప్రసాద్‌లను చారి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జ్యోత్స్న పతకాలు దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరంలోని బుంగవీధికి చెందిన మంగళగిరి గణేష్‌ను గూడ్స్ షెడ్ రోడ్డులో అదుపులోకి తీసుకుని మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. నిందితుడి దగ్గర నుంచి గంజాయితో పాటు స్కూటీ, రూ.220 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదేవిధంగా మరో కేసుకు సంబంధించి మూడు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జెట్టీపై జాప్యం ఎందుకో?

● నిర్మాణానికి గతంలో రూ.23 కోట్లు మంజూరు
● శంకుస్థాపన చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
● అధికారంలోకి వచ్చాక ఊసెత్తని కూటమి సర్కారు
● అవస్థలు పడుతున్న గంగపుత్రులు



చింతపల్లితీరంలో జెట్టీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

పూసపాటిరేగ: తీరప్రాంతం చింతపల్లిలో మంజూరైన జెట్టీ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వం హయాంలో చింతపల్లికి రూ.23 కోట్లతో జెట్టీ మంజూరు చేశారు. అన్ని అడ్డంకులు తొలగి ఆర్థికశాఖ అనుమతులు వచ్చిన తరువాత అప్పట్లో సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఈ జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతున్నా జెట్టీ ఊసెత్తలేదు. జిల్లాలో తీరప్రాంత మత్స్యకారుల ప్రధాన అవసరమైన జెట్టీ నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెట్టీ నిర్మాణం కాకపోవడం, తరచూ తుఫాన్ల హెచ్చరికలు జారీ అవడం వంటి కారణాలతో తీరప్రాంతం నుంచి సుమారు 3 వేల మంది మత్స్యకారులు వలస బాట పట్టారు.

ఇదీ పరిస్థితి ..

జిల్లాలో తీరప్రాంతమైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సుమారు 21 వేలు మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 6 వేల మంది చేపలు వేటే ప్రధాన వృత్తిగా చేస్తున్నారు. 15 వేల మంది వారిపై పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. రెండు మండలాల్లో 885 బోట్లలో సుమారు 3798 మంది మత్స్యకారులు నిత్యం వేటను సాగిస్తుంటారు. వేటలేక వివిధ కారణాల రీత్యా మరో 3000 మంది మత్స్యకారులు బతుకుతెరువుకోసం విశాఖ, గుజరాత్, సూరత్, హీరావల్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. తీరంలో జెట్టీ నిర్మాణం కాకపోవడంతో విపత్తుల సమ యంలో పడవలు, వలలు సముద్రంలో కొట్టుకుపోయి నష్టాలు చవిచూస్తున్నామని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు.

కాలుష్యంతో మత్స్య సంపద నాశనం

జెట్టీ సమస్యతో పాటు పరిశ్రమల వ్యర్థ రసాయనాలు తమ పొట్ట కొడుతున్నాయని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. రసాయన పరిశ్రమల వ్యర్థ జలాలు సముద్రంలో కలియడంతో మత్స్యసంపదకు తీవ్రనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలం క్రితం వరకు చేపల వేటకు వెళ్తే భారీగా వలకు చేపలు చిక్కేవి. నేటి పరిస్థితి చూస్తే బిన్నంగా ఉండదని వాపోతున్నారు. పరిశ్రమల వ్యర్థ జలాలు కారణంగా మత్స్య సంపద వలకు చిక్కడం లేదు. చేపల వేట సాగని గంగపుత్రులు జీవనోపాధి కరువై వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

జెట్టీ నిర్మించాలి

జెట్టీ లేకపోవడంతో వేట చేసిన తరువాత ఒడ్డుకు చేరిన బోట్లకు రక్షణ లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీవ్రనష్టాలు చవిచూస్తున్నాం. గత ప్రభుత్వంలో జెట్టీకి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం జెట్టీ నిర్మాణంపై నిర్లక్ష్యం చేయకుండా నిర్మాణంపై దృష్టి సారించాలి.

బి. అప్పలస్వామి, బర్రిపేట

ఉపాధికోసం ఎదురు చూపులు

చేపల వేటపైనే ప్రధానంగా అధారపడి జీవిస్తున్న మత్స్యకారులు జెట్టీ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. జెట్టీ లేకపోవడంతో పాటు పరిశ్రమల కాలుష్యం కారణంగా వేట సాగకపోవడంతో జీవనోపాధి కోల్పోతున్నాం. నూతన ప్రభుత్వంలో జెట్టీ నిర్మాణం ప్రారంభించి సకాలంలో పూర్తి చేసి మత్స్యకారులను ఆదుకోవాలి.

బి. కొర్లయ్య, చింతపల్లి

గిరిజనుల జీవన ప్రమాణాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ



జీసీసీ ఎం.డితో చర్చిస్తున్న అరకు ఎంపీ తనూజా రాణి, చెట్టి వినయ్

● అరకు ఎంపీ తనూజరాణి
● జీసీసీ ఎం.డీతో భేటీ

సాక్షి, విశాఖపట్నం: గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా జీసీసీ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తూ.. గిరిజన ప్రాంత సమగ్రాభివృద్ధికి సహకరించాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి సూచించారు. ఈ మేరకు గిరిజన సహకార సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జీసీసీ ప్రధాన కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆమె.. జీసీసీ ఎం.డి కల్పనాకుమారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలను ఎం.డితో ప్రస్తావిస్తూ..పరిష్కార మార్గాలను కూడా వివరించారు. దళారీ వ్యవస్థ నుంచి కాపాడుతూ గిరిజనులకు జీవనోపాధి కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వెనువెంటనే విక్రయించకుండా జాప్యం చేస్తుండడంతో టర్నోవర్ పెరగక నష్టం వాటిల్లుతోందని ఆందోళన వెలి బుచ్చారు. అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని.. ప్రస్తుతం పెంచిన ధరలపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. డివిజనల్, గిరిజన ప్రాథమిక పరపతి సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కాఫీ సేకరించిన 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు నేరుగా జమ అయ్యేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. జీసీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని సూచించారు. కొన్ని అనాలోచిత నిర్ణయాలతో అధికారులు, ఉద్యోగులు జీసీసీని నష్టాల బాట పట్టిస్తున్నారని ఎం.డికి ఫిర్యాదు చేశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పార్లమెంట్ సాక్షిగా గళం విప్పి.. గిరిజనుల హక్కులు, జీసీసీకి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ అంశాలకు సంబంధించి విభాగాల వారీగా ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపడతామని జీసీసీ ఎం.డి కల్పన హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు.

క్రీడా సముదాయానికి పదెకరాలు



కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వరరావు తదితరులు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో క్రీడా సముదాయం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పది ఎకరాల స్థలాన్ని కేటాయించడం పట్ల జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, శాప్, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సీతానగరం మండలంలోని జోగింపేట వద్ద క్రీడా సముదాయానికి స్థలాన్ని కేటాయించడం కలెక్టరేట్‌కు వెళ్లి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సీతానగరం తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు స్థలాన్ని క్రీడా ప్రాధికార సంస్థకు శనివారం అప్పగించారు.

ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధి తలగాం గ్రామం సమీపంలో శనివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఎదురెదురుగా బైక్‌లపై వస్తున్న కె.గౌరీశ్వరరావు, పి.రాంబాబులు ఒకరినొకరు ఢీకొట్టి కిందపడి గాయపడ్డారు. వైద్యం కోసం వారిద్దరిని రాజాం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ధర్నాలు



ధర్నాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం నుంచి ఈ నెల 30 వరకు మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిం చనున్నట్లు ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి డి.పండు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ధర్నాకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 2 నుంచి 4వ తేదీవరకు కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దీక్షలను నిర్వహించడంతోపాటు నవంబర్ 6న చలో కలెక్టరేట్ పిలుపునిచ్చామన్నారు. విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లకు సంబంధించి విద్యాదీవెన, వసతిదీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.3వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్సీ, బీసీ, పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు సొంత భవనాలను, గిరిజన పోస్టు మెట్రిక్ వసతిగృహాలకు అదనపు భవనాలను నిర్మించాలని కోరారు. ఈ ధర్నాల్లో విద్యార్థులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్, టి.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

టీవీ రిపోర్టర్‌పై దాడి

● ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితుడు



దాడిలో గాయపడిన రిపోర్టర్



దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు గ్రంధి రామారావు నారా లోకేష్‌తో దిగిన ఫొటో (ఫైల్)

పార్వతీపురంటౌన్: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులు చేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగింది. శుక్రవారం ఓ టీవీ చానల్‌కు చెందిన జర్నలిస్ట్ తన కుటుంబంతో కలిసి పార్వతీపురం పట్టణంలోని 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌కు చెందిన ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. కుటుంబసభ్యులు బిర్యానీ కావాలని అడగడంతో చికెన్ ధమ్ బిర్యానీ ఆర్డర్ పెట్టాడు. ఆర్డర్ పెట్టిన 20 నిమిషాలకు బిర్యానీని సర్వర్ టేబుల్ పైకి తీసుకు వచ్చాడు. బిర్యానీ పాచివాసన రావడంతో..బిర్యానీలో నాణ్యత లోపించిందని సదరు రెస్టారెంట్ యాజమాన్యాన్ని రిపోర్టర్ ప్రశ్నించాడు. దీనికి 12వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు గ్రంధి రామారావు తింటే తిను లేకపోతే బయటకు పో అంటూ వాగ్వాదానికి దిగాడు. తాను రిపోర్టర్‌నని నాణ్యత లోపిస్తే ప్రజలకు చేరవేస్తానని రిపోర్టర్ చెప్పగా సదరు రిపోర్టర్‌పై టీడీపీ నాయకుడు భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఇంత జరుగుతున్నా రెస్టారెంట్ యాజమాన్యం ప్రేక్షక పాత్ర వహించడం శోచనీయం.

జర్నలిస్టు సంఘాల నిరసన

జర్నలిస్టుపై జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ పార్వతీపురం కలెక్టరేట్ ఆవరణలో జర్నలిస్టు సంఘాలు ఏపీడబ్ల్యూజే, పీయూజే శనివారం నిరసన తెలిపాయి. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి ఎస్పీ మాధవరెడ్డికి ఫోన్‌చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



గంగాధర్ మృతదేహం

విజయనగరం క్రైమ్: టాయిలెట్‌కి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు సున్నంబట్టి వీధి సమీపంలో నివాసం ఉంటున్న గంగాధర్ (30) తల్లితో కలిసి ఆటోలో గూడ్స్ షెడ్ వైపు వెళ్తున్నాడు. రైల్వేఅండర్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి టాయిలెట్‌కి వెళ్లివస్తానని ఆటోను పక్కన ఆపించి, రోడ్డు దాటే క్రమంలో అటునుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడంతోతలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పది' పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

● 28 నుంచి చెల్లింపు ప్రారంభం

విజయనగరం అర్బన్: ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలకు ఫీజు చెల్లించే షెడ్యూల్‌ను శనివారం ఎస్ఎస్ సి బోర్డు విడుదల చేసింది. ఈ మేరకు డీఈవో యు మాణిక్యం నాయుడు వివరాలను ప్రకటించారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌ను కూడా ప్రధానోపాధ్యాయులు ఈ తేదీలోపే పంపించాలని సూచించారు. అన్ని సబ్జెక్టులకు (మూడు సబ్జెక్టులు మించి) రూ.120, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, వొకేషనల్ విద్యార్థులు సబ్జెక్టుకు అదనంగా రూ.60, నిర్ణీత వయసు కంటే తక్కువ ఉన్నవారు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.60 చెల్లించాలని పేర్కొన్నారు. రూ. 50 ఆలస్య రుసుముతో వచ్చే నెల 18వ తేదీ, రూ.200 ఆలస్య రుసుముతో వచ్చేనెల 25వ తేదీ, రూ.500 లేట్ ఫీజుతో నవంబరు 30 లోపు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹224

కష్టానికి దక్కని ఫలితం

● పొద్దుపొడవగానే కొండపోడు పనులకు వెళ్లేనే జీవనం
● కావిళ్లతో సుదూర ప్రాంతాలకు పంట తరలింపు
● మైదాన ప్రాంత సంతలకు వచ్చి విక్రయాలు
● ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
● ఆదివాసీల ఉత్పత్తులకు మార్కెటింగ్ ఎక్కడ?



కొనుగోలు దారుల కోసం ఎదురు చూస్తున్న గిరిజన రైతులు



అటవీఉత్పత్తులు సేకరిస్తున్న గిరిజనులు



మార్కెట్లో కొండచీపుళ్లు విక్రయిస్తున్న గిరిజనులు

సీతంపేట: ఆదిమవాసులు, గిరిజనుల జీవన విధానం అటవీఉత్పత్తులతోనే ముడిపడి ఉంది. పొద్దుపొడవగానే కొండపోడు పనులకు వెళ్లేనే వారి బతుకులు తెల్లారతాయి. అటవీఉత్పత్తులకు మార్కెట్ ధర ఉంటే పర్వాలేదు. లేకపోతే ఉసూరు మంటూ ఇంటికి ఖాళీగా వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్నా ప్రభుత్వ పరంగా సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేవు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎటువంటి సహకారం లేదని పలువురు గిరిజన రైతులు వాపోతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 మండలాలున్నాయి. వాటిలో టీపీఎంయూ (ట్రైబల్ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్)లో ఏడు మండలాలున్నాయి. సుమారు 2 లక్షల జనాభా నివసిస్తున్నారు. 74 వేల గిరిజన కుటుంబాలు 1200 గ్రామాల్లో నివసిస్తున్నాయి. వారిలో కొండలపై నివసించే ఆదిమ గిరిజనులు 35 వేల మంది వరకు ఉంటారు. వీరు అనాదిగా కొండపోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీఉత్పత్తులు సేకరించి వాటిని కొండల నుంచి మోసుకుంటూ కిందికి దిగి వ్యాపారులకు విక్రయించి వెళ్తారు. ముఖ్యంగా వారపు సంతల రోజున సీతంపేట(సోమవారం), మర్రిపాడు (బుధవారం), దోనుబాయి (గురువారం), పొల్ల, కుశిమి(శనివారం) గ్రామాలకు వచ్చి అటవీఉత్పత్తులు విక్రయించి వారికి కావాల్సిన నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. వారపు సంతకు వెళ్లే మధ్యలోనే కొంతమంది వచ్చి బేరసారాలు చేసి ఉత్పత్తులు దక్కించుకుంటారు. ఎంతో కొంత చేతిలో పెట్టి వెళ్తారు.

అటవీఉత్పత్తులివే..

గిరిజనులు ముఖ్యంగా కొండచీపుళ్లు, చింతపండు, పసుపు, ఉసిరి, నిమ్మకాయలు, దబ్బ, పెండలం, పైనాపిల్, సీతాఫలం, అరటి తదితర ఉత్పత్తులు విక్రయిస్తారు. వాటిలో సేకరణ కష్టమైనవి కొండ చీపుళ్లు, చింతపండు. కొండలపైకి వెళ్లి చీపురు పుల్లలు ఏరుకుని ఇంటికి తీసుకువచ్చి గ్రేడింగ్ చేసి వాటిని చీపురుగా తయారు చేస్తారు. వాటిని ఒక్కొక్కటి రూ.35 వరకు విక్రయిస్తారు. సీతాఫలం కావిడ రూ.1100కు సరాసరి విక్రయిస్తున్నారు. పైనాపిల్ సీజన్‌లో ఒక్కో పండు రూ.15 నుంచి రూ.20 మధ్య విక్రయించారు. పసుపు సైతం సేకరించి ఉడకబెట్టి ఎండబెట్టిన అనంతరం మార్కెట్‌కు కావిళ్ల లెక్కన తీసుకువస్తూ కావిడ రూ.800ల వరకు విక్రయిస్తున్నారు. చింతపండు సీజన్‌లో కావిడ రూ.2 వేల వరకు అమ్మకాలు జరుపుతారు. అలాగే నారింజ, పుట్టదబ్బ వంటి ఉత్పత్తులు కేవలం రూ.200ల లోపే విక్రయిస్తున్నారు.


మైదాన ప్రాంత దళారుల కోసం ఎదురు చూపులే..

అటవీఉత్పత్తుల కొనుగోలుకు గిరిజన సహకారసంస్థ వంటివి ఉన్నా ఈ తరహా ఉత్పత్తులు కొనుగోలు చేయకపోవడంతో దళారులకే విక్రయించాల్సి వస్తోందని గిరిజనులు చెబుతున్నారు. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు రాకపోతే ఎవరికి విక్రయించాలో తెలియని పరిస్థితి తమకు ఉండేదని గిరిజనులు చెబుతున్నారు. వారు చెప్పిన ధరలకే అమ్మకాలు జరుపుతామని, కొన్ని సందర్భాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారిపోతే తమ కష్టమంతా వృథా అవుతుందని వాపోతున్నారు.

అటవీఉత్పత్తులు విక్రయిస్తేనే జీవనం

మా ఆదిమ గిరిజనులంతా అటవీఉత్పత్తులపైనే ఆదారపడి జీవనం సాగిస్తాం. పిల్లాపాపలతో కలిసి కొండపోడుకు వేకువజామునే వెళ్లి మళ్లీ సాయంత్రమే ఇంటికి చేరుకుంటాం. రోజంతా కష్టపడినా శ్రమకు తగ్గ ప్రతిఫలం లభించదు. ఎన్నో నిరుపేద గిరిజన కుటుంబాలు ఒక పూట గడిస్తే మరో పూట గడవని పరిస్థితి ఉంది.


కొండచీపుళ్లు తక్కువ ధరకు అడుగుతున్నారు



కొండ చీపుళ్లు తక్కువ ధరకు అడుగుతున్నారు. గతంలో ఒక్కో చీపురును రూ.50కిపైనే విక్రయించే వాడిని. ఇప్పుడు చీపురు రూ.30కి అడుగుతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉంది. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు ఏవీ లేవు.

ఎస్.తోటయ్య, గొయ్యిగూడ

వర్షాధార పంటలే



ఎక్కువగా వర్షాధార పంటలే మన్యంలో పండుతాయి. వరి పంట పండించుకోవడానికి వర్షాలు ఉంటేనే పండుతుంది. అందరికీ భూములు లేవు. గెడ్డలు ఉన్న చోట కొద్ది మందికి మాత్రమే భూములు ఉన్నాయి. గెడ్డలే వరిపంటకు కీలకం. వర్షాలు పడితే గెడ్డలు నిండిపంటలు పండుతాయి. లేకపోతే వరికూడా పండడం కష్టం.

ఎన్. నారాయణరావు, కంబగూడ